ప్రజాశక్తి

సోమవారం 24 ఏప్రిల్ 2023


5

అల్లూరి సీతారామరాజు



పెదబయలులో వడగళ్ల వాన

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలో ఆదివారం జోరున వర్షం కురిసింది. తెల్లారు జామున విపరీతమైన గాలి వర్షం రావడంతో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులతో గాలి. వర్షం. కురిసింది. డ్రైనేజీల్ లేక పోవడంతో మెయిన్ రోడ్డు పై ఉన్న చెత్త చెదారం ఇళ్ల వద్దకు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. రెంటల్. హౌసింగ్ కాలనీ సమీపంలో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.



కురుస్తున్న వడగళ్ల వాన

నేడు పాడేరులో ప్రచార భేరి బహిరంగ సభ

▶▶ హాజరు కానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర నేత బాలేపల్లి

▶▶ ఇప్పటికే బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ఏజెన్సీలో ముమ్మరంగా ప్రచారం

ప్రజాశక్తి-పాడేరు: కేంద్రంలోని బిజెపిని గద్దె దించుదాం- దేశాన్ని కాపాడుదాం అనే నినాదంతో సిపిఎం సిపిఐ పాడేరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రచార బేరి పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం పాడేరులో బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. పాడేరు ఐటిడిఏ ముందు నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కమిటీ నాయకులు బాలేపల్లి వెంకటరమణ హాజరవుతున్నారని అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన కార్మిక వ్యతిరేక నిరంకుశమైన మతోన్మాద విధానాలతో ఆదివాసీల రక్షణకు బిజెపి ముప్పు కలిగిస్తుందన్నారు. గిరిజన చట్టాలను హక్కులను కాలరాస్తున్న బిజెపిపై జరిగే బహిరంగ సభను గిరిజన వర్గాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

పాడేరు నియోజకవర్గంలో సీలేరు నుంచి ఈనెల 14న ప్రారంభించిన ఈ ప్రచార బేరి పాదయాత్ర జీకే వీధి కొయ్యూరు, చింతపల్లి, జిమాడుగుల, పాడేరు మండలాల్లో కొనసాగించినట్లు ఆయన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, ఉత్తరాంధ్ర ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ, గిరిజన వర్సిటీ నిర్మాణం, వంటి విభజన హామీల అమల్లో చేసిన నిర్లక్ష్యంపై ప్రచార బేరి పాదయాత్రలో వివరించి ప్రజల్లో చైతన్యం కల్పించామని తెలిపారు. అటవీ గిరిజన చట్టాలను బలహీనపరిచి సహజ సంపదలను దోచుకోవాలని కేంద్రం చూస్తోందన్నారు. అభివృద్ధి పేరిట చేస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుపై ఆయా ప్రాంతాల్లోని ఆదివాసి వర్గాలన్నీ సర్వత్రా ఈ ప్రచారంలో తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ బోయ/ వాల్మీకుల్ని ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు సుముఖంగా ఉందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఆదివాసి ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. టిడిపి, వైసీవీ, బీజేపీ పార్టీలు అవకాశవాదంతో ఆదివాసీలను మోసగించేందుకు కుట్ర చేస్తున్నాయని వెల్లడించారు ఆదివాసీల హక్కుల రక్షణ కోసం ప్రజా పోరాటాలను సాగించాలని పిలుపు నిచ్చామని తెలిపారు.

24న పాడేరు ఐటిడిఏ ముందు జరిగే సభకు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు బాలేపల్లి వెంకటరమణ. 25న అరకు వేలి లో జరిగే సభకు. సిపిఎం పోల్యాట్ బ్యూరో సభ్యులు. బీవీ రాఘవులు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి హాజరుకానున్నారని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాడేరు చేరుకున్న పాదయాత్ర

పాడేరు:- కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, గిరిజన, కార్మిక, వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలో ఈనెల 14 నుంచి సిలేరులో ప్రారంభించిన పాదయాత్ర ఆదివారం సాయంత్రం పాడేరు చేరుకుంది. ఐదు మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటిస్తూ విజయవంతంగా పాదయాత్ర కొనసాగించి పాడేరు చేరుకున్న సిపిఎం, సిపిఐ శ్రేణులకు పాడేరు అంబేద్కర్ సెంటర్లో కార్యకర్తలు స్వాగతం పలికారు.



పాడేరు చేరుకున్న ప్రచార భేరి పాదయాత్ర

రేపు అరకులోయలో బహిరంగ సభ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రజా, కార్మిక వ్యతిరేక నిరంకుశ బిజెపిని గద్దెదించుదాం.. దేశాన్ని కాపాడుదాం అనే నినాదంతో అరకులోయలో సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 25న జరిగే బహిరంగ సభకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బహిరంగ సభకు జెండాలు, తోరణాలు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు.



జెండాలు సిద్ధం చేస్తున్న నేతలు

అరకొర నీటితో అవస్థలు

◆ నెలల తరబడి మరమ్మతులకు గురైన బోర్లు

◆ సరిపడా నీరివ్వని జలజీవన్ మిషన్ కుళాయిలు

◆ గిరిజనం ఇబ్బందులు. పట్టని అధికారులు

ప్రజాశక్తి -సీలేరు : వేసవి ఎండలు మండుతున్న పరిస్థితుల్లో ప్రజల నీటి అవసరాలు ఒకవైపు పెరుగుతుంటే, మరోవైపు మొరాయిస్తున్న బోర్లు, అడుగంటిన భూగర్భజలాలు, అరకొరగా నీరిచ్చే కుళాయిలతో ప్రజలు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. ఏటా వేసవిలో ఇదే పరిస్థితి నెలకొంటుండగా, నీటిఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు చేస్తున్నా వాటి అమలు సరిగా లేక ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ధారకొండ పంచాయతీ ఏనుగుబయలు, ధారకొండ కాలనీ, చాకిరేవు గెడ్డలో నీటి కష్టాలే ఇందుక నిదర్శనమని స్థానికులు వాపోతున్నారు.



బిందెడు నీటి కోసం బోర్ల వద్ద మహిళల పడిగాపులు

మండలంలోని దారకొండ పంచాయతీ ఏనుగుబయలు, ధారకొండ కాలనీ, చాకిరేవుగెడ్డలో అరకొర నీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏనుగుబబయలులో నాలుగుబోర్లు ఉంటే వాటిలో రెండు బోర్లు కొన్నాళ్లక్రితమే మరమ్మతుకు గురై మూలకు చేరాయి. ధారకొండ కాలనీలో రెండుబోర్లలో ఒకటి, చాకిరేవుగెడ్డలో ఉన్న ఒక్క బోరు మరమ్మతుకు గురైనా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో పనిచేస్తున్న బోర్లులోనూ సన్నటిధారతో నీరు వస్తుండడంతో గంటల తరబడి బోర్లు వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని అంటున్నారు.

ఇదిలా ఉంటే మరోవైపు జలజీవన్ మిషన్ కింద ఆయా గ్రామాల్లో ఇంటింటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ నీటి కష్టాలు తీరలేదని స్థానికులు అంటున్నారు. రోడ్డు పనుల్లో భాగంగా ప్రొక్లెయినర్‌తో చేపట్టిన పనులతో జలజీవన్‌మిషన్ పైపులైన్లను పీకేయడంతో కొన్నాళ్లుగా కుళాయిలు ఒట్టిపోయాయి, రెండు రోజుల క్రితమే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి, నీటిసరఫరా పునరుద్ధరించినప్పటికీ, చాలీచాలని నీటి సరఫరాతో మళ్లీ బోర్లు వద్దకు పరుగులు తప్పడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వేసవి తొలిరోజుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి ఇంకెంత తీవ్రంగా ఉంటుందోనని ఇప్పటి నుండే గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పాడైన బోర్లు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవడంతోపాటు జలజీవన్‌మిషన్ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీటిసరఫరాకు చర్యలు చేపట్టి, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారించాలి : రాజుకోటి

మారుమూల గ్రామాల్లో ఏటా వేసవిలో నీటి ఎద్దడి నెలకొంటున్నా అధికారులు కనీస ముందస్తు చర్యలు చేపట్టకపోవడం నిర్లక్ష్యమేనని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాజుకోటి విమర్శించారు. ధారకొండ పంచాయతీలో బోర్లు పాడవ్వడంతోపాటు ఉన్నబోర్లులోనూ నీరు అడుగంటిపోవడం, జలజీవన్ మిషన్ కుళాయిల ద్వారా పూర్తిస్థాయి నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని రాజుకోటి కోరారు. లేకుంటే గిరిజనులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: మన్య ప్రజల ఇలవేల్పు మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలను పాడేరులో వచ్చే నెల 14, 15, 16 తేదీలలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉత్సవాల ప్రచార కరపత్రాలను ఆమె ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అమ్మవారి జాతర నిర్వహణ, విరాళాల సేకరణ కోసం జాతర ఏర్పాట్లపై అహర్నిశలు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులను ఆమె అభినందించారు. జాతరలో భాగంగా పెద్ద ఎత్తున పాడేరు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతేడాది మోద కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ ద్వారా ఉత్సవాల మూడు రోజులు ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణ నిర్వహించామని ఈ ఏడాది కూడా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ద్వారా వారికి తోడ్పాటును అందిస్తామని తెలిపారు. అమ్మవారి జాతరపై గ్రామాల్లో కరపత్రాల ద్వారా విస్తత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి జాతరను వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల వారు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్ట గుల్లి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కొట్టగుల్లి సుబ్బారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వర్తన పిన్నయ్యదొర, ప్రధాన కార్యదర్శులు తమర్భ ప్రసాద్ నాయుడు, నవర కొండబాబు, యాదగిరి శ్రీను, ఉప సర్పంచ్ భూ రెడ్డి రాము, ఉత్సవ కమిటీ ఆలయ కమిటీ ప్రతినిధులు లకే నాని పాత్రుడు, బోనంగి వెంకట రమణ, పూసర్ల గోపి, ఉప్పల వెంకటరత్నం, సత్యమోహన్. అన్నదాన ట్రస్ట్ నిర్వాహకులు శివరాత్రి శ్రీనివాస్ కుమార్, ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కమిటీ ప్రతినిధులు



ఊట నీటిని సేకరిస్తున్న మహిళలు

తాగునీటి సమస్యతో సతమతం

- గెడ్డ నీరే గిరిజనులకు గతి

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని పెద్దబిడ్డ పంచాయతీ సుద్ధగరు గ్రామంలో తాగునీటి సమస్యతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని బోరు బావి, తాగునీటి పైపులైన్ వంటి సౌకర్యాలు లేక గ్రామానికి సమీపంలో ఉన్న కలుషితమైన ఊటనీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఉన్న ఊట గెడ్డ కూడా అట్టడుగుకు ఇంకి పోవడంతో తాగునీటి కోసం మహిళలు మైలుదూరన్న గెడ్డలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఆర్ డబ్యుఎస్ అధికారులకు అనేకసార్లు కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసామని ఎ.ఎర్రమ్మ, ఎ.అప్పాలమ్మ, సిందుకొడి, కమల, ఎ.లక్ష్మిలు వాపోయారు. పదేళ్ల క్రితం బోరు ఏర్పాటు చేసినప్పటికీ కనీసం చుక్క నీరు కూడా అందలేదని, దీంతో బోరు మూలకు చేరిందన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రస్తుతం తాము ఎక్కడైతే ఊట నీరు సేకరిస్తున్నామో అక్కడి నుండి పైపులు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరారు. లేని పక్షాన మండల కేంద్రంలో ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



పాల డబ్బాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు, గిరిజన సంఘం నేత సురేంద్ర

పాల డబ్బాల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: తల్లిపాలకు దూరమైన మండలంలోని సరియవలస గ్రామానికి చెందిన పి భూమికకు చెందిన నెల బాబుకు అరకులోని యూనిటీ చారిటీ ఫర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలకు సరిపడే ఉచితంగా పాల డబ్బాలను పంపిణీ చేశారు. ఈ పాల డబ్బాలను గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, భూమికకు పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందకపోవడంతో యూనిటీ పర్ చారిటీ ట్రస్టు దత్తత తీసుకొని ఎదిగేంతవరకు ఉచితంగా పాల డబ్బాలను ట్రస్ట్ అందిస్తుందన్నారు. నిరుపేద లకు ఇటువంటి సేవ కార్యక్రమాలు చేపడుతున్న చారిటీ ట్రస్టుకు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నీలి నారాయణరావు, నీలి మేరీ జోష్ పిన్, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ టీ.సూర్యనారాయణ, పీ.తిలక్ పాల్గొన్నారు.

బిజెపి నిర్వాకంతో ఉపాధి నిర్వీర్యం

ప్రచారభేరి పాదయాత్రలో వామపక్ష పార్టీల నేతలు

విఆర్.పురం: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆదివారం మండలంలోని రేఖపల్లి పంచాయతీ ముమ్మిడివరం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ, కరపత్రాలను పంచి, బిజెపి విధానాలపై ప్రజలకు వివరించి చైతన్యపరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి, పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. పనిప్రదేశంలో టెంట్లు, తాగునీరు వైద్య సౌకర్యాలు కల్పించాలని, గునపాలు, పారలు వంటి ఉపాధి పనిముట్లు అందించాలని, ఉపాధి కూలీలకు వేసవి బోనస్ అందించాలని కోరారు.

ముమ్మిడివరం గ్రామాన్ని 41.5 కాంటూరులో చేర్చి, అటవీశాఖ ఆగడాలను అరికట్టాలని, సాగుభూములకు పోడుపట్టాలు ఇవ్వాలని కోరారు. బోయ/వాల్మీకి, బెంతుఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన తీర్మానాన్ని ఆమోదించకుండా తిప్పిపంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ సెక్రటరీ కురసం నాగేశ్వరరావు, చిక్కాల గ్రామస్తులు పాల్గొన్నారు

4న 'చలో చింతూరు' వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

ఎటపాక : మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చేనెల 4న చింతూరులో నిర్వహించే బహిరంగ సభ జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందుకూరి స్వర్ణ కోరారు. ఆదివారం గన్నవరం గ్రామంలో సిపిఐ, సిపిఎం జిల్లా, మండల నాయకులు ఆధ్వర్యంలో చింతూరు బహిరంగసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. బహిరంగసభకు చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రచారభేరిలో భాగంగా గ్రామాల్లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తూ, ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు వెల్లడించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, గన్నవరం ఎంపిటిసి కంటెరాజు, సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐవి., సిపిఐ జిల్లా నాయకులు వాసం రాము, సిపిఎం ఎటపాక మండల నాయకులు ఆకిశెట్టి రాము, సోందె రామారావు, సిపిఐ నాయకులు వల్లభనేని సత్యనారాయణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సుంకరమెట్ట వారపు సంతలో ప్రచార బేరి జీపు జాతలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల నాయకులు పొద్దు బాలదేవ్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వివి జయ మాట్లాడారు. మోడీని అధికారం నుండి గద్దెదించి దేశ సంపదను కాపాడాలని పిలుపునిచ్చారు. గిరిజన చట్టాలు, హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని తెలిపారు. .నూతన అటవీ పాలసీ విధానం తీసుకొచ్చి గిరిజనులను అడవి నుండి గెంటివేయాలని ప్రయత్నం చేస్తుందని, తక్షణమే ఈ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశంలో మూడోసారి అధికారంలో రావాలని ప్రయత్నిస్తుందని అన్నారు. విశాఖ స్టీల్, రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు బిజేపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పాంగి రామన్న, బుజ్జి బాబు, కె.బుజ్జిబాబు, జోషి, అప్పన్న, నానిబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సుంకరమెట్ట వారపు సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు



విఆర్.పురంలో ప్రచారభేరి పాదయాత్ర




ఎటపాకలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో వామపక్ష పార్టీల నేతలు

వైభవంగా మారెమ్మ వార్షికోత్సవం



క్యూ లైన్లలో మహిళా భక్తులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో మారమ్మ అమ్మవారి 51వ వార్షికోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి, ఒడ వేడిమిని లెక్కచేయకుండా బారులుదీరి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేకపూజలు, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు మజ్జిగ పంపిణీ చేపట్టారు. అనంతరం టకిరి బుట్టి ఆర్థిక సహాయంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మారమ్మ అమ్మవారి పండగను తిలకించేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మారమ్మపై భక్తులకు విశేష నమ్మకం ఉండడంతో పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలన్నీ భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి దర్శనానికివచ్చిన భక్తులు ధన, వస్తు రూపేణా కానుకలు సమర్పించారు. భక్తుల వినోదానికి ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

ఘనంగా ఎంపి మాధవి జన్మదిన వేడుకలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెం గ్రామంలో అరకు ఎంపీ గొట్టేటి మాధవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 600 మంది నిరుపేద గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టుగుళ్లి భాగ్యలక్ష్మి జన్మదిన వేడుకల్లో పాల్గొని, ఎంపీ మాధవికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎపి చైర్మన్ రాజులమ్మ, ఎంపిపి బడుగు రమేష్ , వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ఎంపిటిసి లోకుల గాంధీ, వైసిపి గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గొడ్డేటి మహేష్ పాల్గొన్నారు.

చింతలవీధిలో మోదకొండమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి -పాడేరు:మండలంలోని చింతలవీధి పంచాయతీ కేంద్రంలో మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మోదకొండమ్మ ఉత్సవ మూర్తిని భక్తులతో కలిసి ఊరేగించి అమ్మవారిని కొలువు తీర్చడంతో ఈ జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అమ్మవారి పాదాలను ఊరేగిస్తూ ఈ కొలువుత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారి జాతర ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం ఐదు గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శతకంపట్టు వద్ద కొలువు తీర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా పండుగ చేసేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామంలోని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి రూ .50 వేల విరాళం

ప్రజాశక్తి -పాడేరు: మోద కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్‌కు మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల నిర్వహణలో భాగంగా మూడు రోజుల పాటు అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించడం కోసం స్థానిక శాసన సభ్యురాలు, ఆలయ కమిటీ చైర్పర్సన్ కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి తన వంతు సాయంగా రూ.50 వేల నగదు చేశారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్ కుమార్, కార్యదర్శులు బి.ముకుందరావు, ఎస్ కొండలరావు, ఆర్కే రాజు, కారం దేవుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ అన్న సమారాధనకి భక్తులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అమ్మవారి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులందరూ తమ ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి అన్న సమారాధనను జయప్రదం చేయాలని కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి- నక్కపల్లి :విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం చేయడంతో మేధస్సు పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి జనార్ధన్ అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులకు, చిన్నారులకు అవసరమగు నీతి కథలు, చరిత్ర, జనరల్ నాలెడ్జ్ తదితర పుస్తకాలను అందుబాటులో ఉంచారు.విద్యార్థులతో పలు పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలన్నారు. చిన్నతనం నుండే పుస్తక పఠనం అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటి చైర్మెన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ ,పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండ శాఖ గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం లైబ్రరియన్ రాజబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుస్తకం ప్రాముఖ్యతను పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల బాలికలు, పాఠకులు పాల్గొన్నారు .

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆదివారం పాత కృష్ణదేవిపేటలో స్థానిక సర్పంచ్ పందిరి సత్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. అంజు కంటి ఆసుపత్రి (కాకినాడ) సౌజన్యంతో స్థానిక రామాలయం వద్ద ప్రారంభమైన ఈ శిబిరంలో సుమారు వందమంది రోగులకు వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారిలో 22 మందికి ఆపరేషన్ అవసరమని వైద్య బందం నిర్ధారించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో స్థానికులతో పాటుగా నాగపురం, పల్లావూరు, ఏ ఎల్ పురం, బంగారు మెట్ట, కొంగసింగి తదితర గ్రామాల నుండి రోగులు హాజరయ్యారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి -పాయకరావుపేట: మండలంలోని సీతారాంపురం గ్రామంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సీతారామపురం గ్రామంలో ఆదివారం స్వచ్ఛభారత్‌ను చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామాన్ని శుభ్రపరిచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వివిధ వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు పట్ల ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చేందుకు ర్యాలీ చేపట్టారు. వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం గ్రామ సర్పంచ్ పీ.వెంకటకృష్ణ, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జీ.టీ.నాయుడు, భాస్కర్ రావు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్య మిథ్యేనా..

- చెల్లించని విద్యుత్ బిల్లులు
- సరఫరా నిలిపివేసిన అధికారులు
- రెండేళ్లుగా నిరుపయోగంగా కంప్యూటర్ ల్యాబ్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసన కంప్యూటర్ ల్యాబ్ రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. ల్యాబ్‌ను ప్రత్యేక కంటెయినర్‌లో ఏర్పాటు చేసి త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం కల్పించారు. విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో కరెంట్ సరఫరాను ఆ శాఖ అధికారులు నిలిపివేశారు. అప్పటి నుంచి విద్యార్థులు కంప్యూటర్ విద్యకు దూరమయ్యారు.

ఈ పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశ్యంతో 2017-2018లో అప్పటి రోడ్లు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రముఖ కంపెనీ హెచ్‌పి సహకారంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయించారు. ప్రత్యేకంగా ఒక కంటైనర్‌ను కొనుగోలు చేసి 16 కంప్యూటర్లతో దీనిని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా విద్యుత్ కనెక్షన్ తీసుకొని రెండు ఏసిలు బిగించారు. అన్నీ కలిపి సుమారు 30లక్షల వ్యయం అయ్యింది. కంప్యూటర్ బోధనకు ప్రత్యేకంగా టీచర్‌ను నియమించారు. రెండేళ్ల క్రితం వరకు ఇది బాగానే సాగింది. తర్వాత విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో ఈపిడిసిఎల్ అధికారులు సరఫరాను నిలిపివేశారు. దీంతో కంప్యూటర్ విద్యాబోధన అటకెక్కింది. రెండు ఏసిలు, 16 కంప్యూటర్లు, ఫ్యాన్లు, లైట్లు ఉండటంతో అధిక కిలో వాట్ల వాడకం కేటగిరిలో చేర్చారు. ప్రతి నెలా కనీసం బిల్లు రూ.1860 వాడిన విద్యుత్‌ను బట్టి బిల్లు వస్తుంది. పాఠశాలలో నిధులు లేకపోవడంతో రెండేళ్ల నుంచి బిల్లు చెల్లించడం లేదు. ఈపిడిసిఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయినప్పటికీ ప్రతి నెలా రూ.1860 చొప్పున కనీస బిల్లు వస్తుంది. అంతకు ముందున్న బకాయిలతో కలిసి లక్ష రూపాయలు దాటిపోయింది. ఏఎల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 780 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో వీరందరికీ కంప్యూటర్ విద్య అందని పరిస్థితి నెలకొంది.

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో మందులు కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆదివారం డిమాండ్ చేశారు.పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 507వ రోజుకు చేరింది. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు ఆకులు, గడ్డి తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదలడంతో చేపలు మృత్యువాత పడడంతో వేటసాగక ఉపాధి కోల్పోయి ఈ విధంగా ఆకులు, గడ్డి తింటూ జీవించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు.ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో తమ కు జీవన ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వెలబుచ్చారు. చేపలు వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదని ,కొత్త పైపు లైన్ వేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, పిక్కి రమణ, వాసుపల్లి సోమి, చేపలు సోమేష్, బొంది నూకరాజు, మైలపల్లి బాపూజీ, పిక్కి రాజు, మైలపల్లి నరేష్, కొత్వాల్ కాశీ, మైలపల్లి శివాజీ, చోడిపల్లి రాజు, పిక్కి సత్తిరాజు, మైలపల్లి దాగ్రాజు, పిడిమి తాతాజీ, తండేలా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

యువత టెక్నాలజీపై దృష్టి పెట్టాలి : మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :యువత టెక్నాలజీని అందుపుచ్చుకోవాలని, సోషల్ మీడియా వేదికగా సమాచారాన్ని మరింత విస్తతం చేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు సూచించారు. సోషల్ మీడియా విస్తరణలో భాగంగా నర్సీపట్నంలో కల్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ నేతత్వంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా యువసేన రాజేష్ హాజరయ్యారు. ముందుగా స్థానిక కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ప్రచారంలో సోషల్ మీడియా ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలిపారు.రాష్ట్ర భవిష్యత్తుకు సోషల్ మీడియాను యువత ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కోడి కత్తి డ్రామా నుండి గొడ్డలి పోటు వరకు అనేక డ్రామాలాడి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డికి అధికారం చెల్లినట్లేనని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే అనుచరగనం రంగురాళ్ల తవ్వకాలకు, గంజా వ్యాపారాలకు ఎగబడుతున్నారని ఆయన విమర్శించారు.

విజయ్ మాట్లాడుతూ, ఒకానొకప్పుడు నర్సీపట్నంలో విద్యా, వైద్యర రంగాలలో అయ్యన్న అభివద్ధి చేశారని, ఈ తుగ్లక్ ప్రభుత్వం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ను మాస్క్ అడిగినందుకు చంపేశారని విమర్శించారు.రాష్ట్రం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. యువసేన రాజేష్ మాట్లాడుతూ, తాను వైసీపీలో ఉన్నప్పుడు వారిచ్చే తప్పుడు సమాచారంతోనే అయ్యన్నను విమర్శించానని, తనను క్షమించాలని కోరారు.

నత్తనడకన రోడ్డు పనులు

ప్రజాశక్తి- కోటవురట్ల: రామచంద్రపురం వద్ద ఆర్ అండ్‌బి రోడ్డు నుండి గిరిజన గ్రామం అల్లుమయ్యపాలెం వెళ్లే రోడ్డు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. రూ.3.30 కోట్ల ఉపాధి హామీ నిధులతో 5 కి.మీ మేర తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి సంవత్సరం పూర్తయిన నేటికీ మట్టి పనులు మాత్రమే జరుగుతూ ఉండటం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇంతవరకు కేవలం రోడ్డు నిర్మాణంకు క్వారీ రబ్బిష్ పనులు మాత్రమే జరిగాయని, రబ్బిష్ వది లేయడంతో రాత్రి ప్రయాణించే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంతవరకు కేవలం 20 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడం పట్ల సమీప ప్రాంత రైతులు, విద్యార్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుకుంటున్నారు.

ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలి

ప్రజాశక్తి-గొలుగొండ: పాత్రికేయులంతా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ అంకితభావంతో పనిచేయాలని నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర నాయుడు సూచించారు. మండలంలో ఏఎల్ పురం అల్లూరి పార్కులో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు స్వామి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత్రికేయలంతా ప్రజల పక్షాన నిలబడుతూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకురావాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు అనంతరం చిటికెల భాస్కర నాయుడును సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెలపు మణికుమారి, జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.నానాజీ, ఎంపీటీసీ చింతల బుల్లి ప్రసాదు పాల్గొన్నారు

రంగురాళ్ల తవ్వకాలపై ఎమ్మెల్యే సవాల్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:రంగురాళ్ల తవ్వకాలపై ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అయ్యన్నకు సవాల్ విసిరారు. మీడియాకు పంపించిన వీడియోలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగురాళ్లపై తాను ఒక్క రూపాయి సంపాదించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానన్నారు. నిరూపించకపోతే అయ్యన్న రాజకీయాలు నుంచి తప్పుకుంటాడా అని అన్నారు. ఆనాడు రంగురాళ్ల తవ్వకాలు ప్రారంభించింది అయ్యన్న, తనయుడు విజయ్ అని విమర్శించారు. కోట్లాది రూపాయిలు విలువ చేసే లేటరైట్ ను నువ్వు నీ కొడుకు తవ్వుకు పోయారని, మంత్రిగా ఉన్నప్పుడు గంజాయికి నర్సీపట్నం అడ్డగా మార్చింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. ఇన్ని పనులు చేసిన ఆయనను చూస్తుంటే సిగ్గేస్తుందని నర్సీపట్నం పరువు తీసాడని అన్నారు. తవ్వకాలు జరగలేదని మట్టి తరలించలేదని అటవీ శాఖ అధికారులు తెలియజేసినప్పటికీ తమపై బురదజల్లేందుకే ఇటువంటి తప్పుడు ప్రయత్నాలు మారుకోవాలని అన్నారు. గతంలో ఆర్లి అడవిలో రంగురాళ్ల తవ్వకంలో అరెస్టు చేయబడ్డవారు తెలుగుదేశం పార్టీ వాళ్ళని వారి పేర్లు తమ దగ్గర ఉన్నాయని విమర్శించారు.

జయరాజ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో డాక్టర్ పి.జయరాజు చేసిన పలు సేవలను గుర్తించి యూనివర్సల్ చర్చి మినిస్ట్రీస్ ఆర్గనైజేషన్ నెట్వర్క్ డాక్టరేట్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో పెద్దలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన పి జయరాజ్ మాట్లాడుతూ, 16 సంవత్సరాలుగా అందించిన సేవలను గుర్తించి డాక్టరేట్ బహుకరించారని తెలిపారు.

వనితకు భరోసా 'మహిళా సమ్మాన్'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన పథకం ఏప్రిల్ నుంచి తపాలా శాఖలో ప్రారంభమైంది. ఈ పథకంలో వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వడ్డీ లభిస్తుంది. ఇందులో మీ డబ్బును రెండేళ్లపాటు పెట్టుబడి పెట్టవచ్చు. తక్కువ కాల వ్యవధి పెట్టుబడిపై వడ్డీని పొందవచ్చు. దీంతో పాటు ఈ స్కీంలో పెట్టుబడి పెట్టడానికి ఎటువంటి వయో పరిమితిని నిర్ణయించలేదు. ఏ వయస్సులో ఉన్న బాలికలు, మహిళలైనా ఇందులో పెట్టుబడి పెట్టొచ్చు. పథకం మధ్యలో డబ్బు అవసరమైతే పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. మహి ళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో పోస్టల్ శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలను ప్రవేశపెట్టింది. 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనల్లో మహిళలకు ప్రయోజనం చేకూర్చే విదంగా మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన స్కీం కొరకు పోస్టాఫీసులో ఖాతా తెరవచ్చు. ఈ పథకంలో రూ.2లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. దీని కాలపరిమితి 2023 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం చిన్న మొత్తాల పొదుపు, బాలికల కోసం ఉద్దేశించిన సుకన్య సమద్ధి యోజన ,పదకానికి 7.60 శాతం, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం కోసం 8 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఈ రెండు పథకాల తర్వాత అధిక వడ్డీ రేటు ఇస్తున్న పథకం ఇదే కావడం విశేషం. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పొందాలను నుకునేవారు సమీపంలోని పోస్టాఫీసును సందర్శించి మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన ఫారం తీసుకోవాలి. వ్యక్తిగత, ఆర్థిక వివరాలను అందులో దరఖాస్తు పూర్తి చేయాలి. డిపాజిట్ మొత్తాన్ని ఎంచుకుని, నగదు రూపంలోనూ, చెక్, రూపంలోనైనా డిపాజిట్ చేయవచ్చు. పెట్టుబడికి రుజువుగా సర్టిఫికేట్‌ను ఇస్తారు.


రెండేళ్లపాటు ఈ పథకం గరిష్ట పరిమితి రూ. రెండు లక్షల వరకు పెట్టుబడి పెడితే.. ఏడాదికి 7.50 శాతం వడ్డీ చొప్పున మొదటి ఏడాదిలో రూ.15వేలు, రెండవ ఏడాదిలో రూ.16,125లు మొత్తంగా రూ. 31,125లు వడ్డీ పొందవచ్చు.



విజేత జట్టు సభ్యులతో ఎంపిపి లక్ష్మి తదితరులు

ముగిసిన సున్నం రాజయ్య స్మారక క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- విఆర్ పురం : మండలంలోని రేఖపల్లి క్రికెట్ గ్రౌండ్‌లో నెలరోజులుగా నిర్వహిస్తున్న భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య స్మారక మెగా క్రికెట్ టోర్నీ విజేతగా చొప్పల్లి జట్టు నిలిచింది. గత నెల 25న ప్రారంభమై పోటీల్లో లీగ్ దశను ముగించుకొని, ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఫైనల్ మ్యాచ్‌కు ఎంపిపి కారం లక్ష్మి టాస్ వేసి ప్రారంభించగా, చాగాయి చొపల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వల్ల రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ పుణ్యం సరోజిని, చిన్నమట్టపల్లి ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, కనిగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ బహుమతులు అందజేశారు. విజేతకు రూ. 30 వేల నగదు బహుమతిని సున్నం రాజయ్య పేరిట సిపిఎం మండల కమిటీ అందజేయగా, రన్నరప్‌కు రూ.20వేలు నగదు బహుమతి ఉండవల్లి. సూర్య ప్రకాశరావు జ్ఞాపకార్థం వారి కుమారులు ఉండవల్లి గాంధీబాబు హరిబాబు ఇచ్చారు. మూడవ బహుమతి రూ.పదివేలను మాజీ ఎంపిపి కారం శివమయ్య జ్ఞాపకార్థం వారి మేనల్లుళ్ల సున్నం చంద్రావు, సీతారామరాజు ఇచ్చారు. కార్యక్రమంలో. సున్నం రాజయ్య సతీమణి సున్నం సుక్కమ్మ. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, పార్టీ మండలకార్యదర్శి సోయం చిన్నబాబు, మండల కమిటీ సభ్యులు పంకుసత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి గుండిపూడి లక్ష్మణరావు, నాల్లరపు ప్రకాష్, సిహెచ్ హజరత్ పాల్గొన్నారు.



రాజ్‌కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న ఆదివాసీలు

రాజ్‌కుమార్ రెడ్డికి ఘన సత్కారం

ప్రజాశక్తి - మారేడుమిల్లి: ఒక్కపూట తిండికే నానా కష్టం పడే నిరుపేద కుటుంబం నుంచి కష్టపడి చదివి పిహెచ్‌డి డాక్టరేట్ పొందిన మారుమూల బొడ్లంక గ్రామానికి చెందిన ఆదివాసీ బిడ్డ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం మండల కేంద్రంలోని ఎంపిపి పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమానికి పలు ఆదివాసీ ప్రాంతాల నుండి భారీ ఎత్తున గిరిజనులు తరలివచ్చి, రాజ్‌కుమార్‌రెడ్డిని సన్మానించి ఆశీర్వదించారు. లోతట్టు మారుమూల ప్రాంతమైన బొడ్లంక గ్రామం నుండి ఉన్నత విద్యను అభ్యసించడంపై పలువురు ప్రశంసలు కురిపించారు. రాజ్‌కుమార్‌రెడ్డిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలు

రాష్ట్ర స్థాయిలో నాలుగు - జిల్లా స్థాయిలో 27 ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉత్తమ పంచాయతీలుగా రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన నాలుగు పంచాయతీలు ఎంపికయ్యాయి. తొమ్మిది కేటగిరీల్లో మూడు కేటగిరీల కింద ఎంపికైన నాలుగు పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం అమరావతిలో అవార్డులు అందజేయనున్నారు. ఆరోగ్య పంచాయతీ కింద రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు స్వగ్రామమైన దేవరాపల్లి మండలం తారువతో పాటు పాడేరు ఏజెన్సీలోని హుకుంపేట మండలంలోని భీమవరం, మంచి పరిపాలన కింద భీమునిపట్నం మండలంలోని నగరపాలెం, మహిళల స్నేహపూర్వక పంచాయతీ కింద అనకాపల్లి మండలంలోని మార్టూరు ఎంపికయ్యాయి. తొమ్మిది కేటగిరీల కింద జిల్లా స్థాయిలో 27 పంచాయతీలు ఎంపికయ్యాయి. ఎంపికైన అనకాపల్లి జిల్లాలోని 20, పాడేరు డివిజన్‌లోని ఐదు, విశాఖపట్నం జిల్లాలోని రెండు పంచాయతీలకు ఆయా జిల్లా స్థాయిల్లో అవార్డులు అందజేయనున్నారు.

కేటగిరి	ఎంపికైన పంచాయతీలు
పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాలు పెంచడం :	చీడిగుమ్మల, కిల్లంకోట, ఎన్.నర్సాపురం
ఆరోగ్యకర పంచాయతీ :	తారువ, భీమవరం, కొత్తూరు
పిల్లల సంక్షేమం :	దాలివలస, కింతలివల్లపురం, ములకలపల్లి
సమృద్ధిగా తాగునీరు సరఫరా :	దీక్షితుల అగ్రహారం, ఎన్.కొత్తూరు, బుచ్చెంపేట
పరిశుభ్రత, పచ్చదనం :	జి.మాడుగుల, మినుములూరు, చూచికొండ
మౌలిక సదుపాయాలు బాగున్నవి :	ఆరిపాక, వెల్చేరు, కింతాడ కోటపాడు
సాంఘిక భద్రత :	గోపాలపురం, పిప్పళ్ల కొత్తపల్లి, బయ్యవరం
మంచి పరిపాలన :	నగరపాలెం, గడుతూరు, పెదతీనార్ల :
మహిళల స్నేహపూర్వక పంచాయతీ :	మల్లవరం, నగరపాలెం, మార్టూరు

శిల్పారామం అభివృద్ధిపై దృష్టి

వాటర్ వరల్డ్‌కు పెరుగుతున్న ఆదరణ

'ప్రజాశక్తి'తో శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - పిఎం.పాలెం : **'విశాఖ నగరంలో పల్లెటూరు వాతావరణమంతా కలబోసినట్టు కనిపించే ప్రాంతం మధురవాడ శిల్పారామం. ఇది దినదినాభివృద్ధి చెందుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అంతరించిపోతున్న చేనేత హస్తకళలకు, సాంస్కృతిక, జానపద కార్యక్రమాలకు ప్రాణం పోస్తూ ముందుకెళ్తోంది. రాష్ట్రంలో విశాఖను కీలకంగా భావించి పలు చర్యలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం శిల్పారామం అభివృద్ధికీ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే బోలెడు సదుపాయాలు కల్పించింది' అని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు.**



వాటర్ వరల్డ్ ఎలా ఉంది..?

పిపిపి పద్ధతి ద్వారా ప్రైవేటు సంస్థకు శిల్పారామంలో కొంత స్థలాన్ని లీజుకు ఇచ్చి వాటర్ వరల్డ్‌కు అనుమతులు జారీ చేశాం. ఇప్పుడు ఇది పర్యాటకులను ఆకట్టుకుంటోంది. రోజుకి వంద మంది, ఆదివారం 200 పైచిలుకు మంది వస్తున్నారు. క్రమేపీ తాకిడి పెరుగుతోంది.

ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు ఎంతవరకూ వచ్చాయి ?

శిల్పారామం ఆవరణలో ఉన్న శిల్పాలకు రూ.40 లక్షల నిధులతో రంగులద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే రూ.15 లక్షలు ఖర్చు చేశాం.

యోగా కేంద్రం పనులు ఎంతవరకూ వచ్చాయి ?


వ్యాయామం చేసుకునే వారి తాకిడి కూడా శిల్పారామానికి పెరిగింది. వారిని దృష్టిలో పెట్టుకొని దివీస్ సంస్థ సహకారంతో ఎనిమిది లక్షల రూపాయల నిధులతో యోగా కేంద్రాన్ని నిర్మిస్తున్నాం. నెల రోజులలో ఇది అందుబాటులోకి రానుంది.

వస్త్ర ప్రదర్శనలు ఎలా సాగుతున్నాయి ?

గత డిసెంబర్‌లో చేపట్టిన హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన, దాని తర్వాత చేపట్టిన లేపాక్షి హ్యాండ్లూమ్స్, జి 20 పేరిట నిర్వహించిన లేపాక్షి స్టాల్స్ ద్వారా పర్యాటకులను ఆకట్టుకున్నాం. ముందు మరిన్ని నిర్వహిస్తాం.

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల తీరేంటి ?

ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నాం. అంతరించిపోతున్న సాంస్కృతిక కళలకు ప్రాణం పోయాలన్నదే మా తపన. ప్రస్తుతం శిల్పారామానికి నెలకు 10 వేల నుంచి 12 వేల మంది పర్యాటకులు వస్తున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తాం.





మాట్లాడుతున్న సుబ్బరాజు

అవగాహనతో క్షయ వ్యాధి నిర్మూలన

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడం ద్వారా రంపచోడవరం ఏజెన్సీలోని ఏడు మండలాల్లో క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు ప్రకృతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జి సుబ్బరాజు అన్నారు .ఆదివారం ఆర్కే రిసార్ట్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో రెండేళ్లుగా క్షేత్రస్థాయిలో పంచాయతీ సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, ఇతర ప్రతినిధులు, నేతలను సమన్వయపరిచి, గ్రామాల్లో క్షయవ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి, పాజిటివ్ తేలితే మందులు వాడించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏజెన్సీలో ప్రజలు వైద్యం కోసం వనమూలిక వైద్యులు, ఆర్ఎంపిలు, మందుల దుకాణదారులపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఐటిడిఎ పరిధిలో 150 మంది వనమూలికా వైద్యులు, ఇతరులను గుర్తించి, ముందుగా వారికి క్షయవ్యాధిపై అవగాహన కల్పించి, గ్రామాల్లో వ్యాధిలక్షణాలున్న వారిని నిర్ధారణ పరీక్షలకు, వైద్యానికి వెళ్లేలా ప్రోత్సాహించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏడు మండలాల్లో క్షయవ్యాధి పీడితుల సమాచారంపై సర్వే చేస్తున్నామని, ఇప్పటికే 120 పంచాయతీలకు గాను 35 పంచాయతీల్లో సర్వే పూర్తయిందన్నారు. ఒకరి నుంచి మరొకరి వ్యాపించే లక్షణమున్న క్షయవ్యాధిపై ప్రకృతి సంస్థ కోఆర్డినేటర్ల ద్వారా కరపత్రాలను పంపిణీ, నేరుగా వివరించడం ద్వారా ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రభుత్వ సహకారంతో ఏజెన్సీలో ప్రతిఒక్కరినీ భాగస్వాములను చేయడం ద్వారా క్షయవ్యాధి రహితం చేయాలన్నదే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎపి తెలంగాణ ఎన్జీవో కన్సల్టెంట్, కో ఆప్షన్ సభ్యులు ఖాజావల్లి పాల్గొన్నారు

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 26న బహిరంగ సభ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరుగనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షతన రెండో రోజు కొనసాగింది. ముఖ్య వక్తగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కొత్తగా ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయకపోగా ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని చెప్పి పదే, పదే ప్రకటనలు చేయడం సరైనది కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకునేందుకు అఖిలపక్ష పార్టీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసి నాయకులను ప్రధాని మోడీ వద్దకు తీసుకువెళ్లాలన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై బిజెపి చేస్తున్న ప్రకటనలపై వైసిపి, టిడిపి, జనసేనలు కనీసం మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా, మెట్రో రైలు, రైల్వే జోన్‌కు నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేస్తుంటే ప్రాంతీయ పార్టీలు తొత్తుగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా 26న జరుగనున్న బహిరంగ సభలో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, యుఎస్ఎన్.రాజు, వి.నరేంద్ర కుమార్, బి.వెంకటరావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.